క్లుప్తంగా

ముగిసిన విఠలేశ్వరుని జాతర



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భైంసారూరల్: మండలంలోని మహాగాం గ్రామంలోని విఠల రుక్మాబాయి ఆలయంలో సోమవారం జాతర నిర్వహించారు. గ్రామంతోపాటు భైంసా, పార్డి, చాత, హల్దా, తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయంలో గత వారం రోజులుగా సప్తాహం వేడుకలు నిర్వహించారు. సప్తాహం ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణంలో రంగులరాట్నాలు, ఆట బొమ్మలు, గాజులు, మిఠాయిలు విక్రయించే దుకాణాలు వెలిశాయి. జాతరకు వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

మార్కెట్ కార్యాలయం ఎదుట అర్ధనగ్న ప్రదర్శన



పెట్రోల్ బాటిల్‌తో శంకర్

కుభీర్: కుభీర్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట పార్డి(బి)గ్రామానికి చెందిన కొత్తిమీర శంకర్ సోమవారం అర్ధనగ్న ప్రదర్శన చేశాడు. మార్కెట్ చైర్మన్ పదవిని దళితులకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ పెట్రోల్ బాటిల్‌తో కూర్చున్నాడు. పోలీసులు అక్కడికి చేరుకుని అతన్ని స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై మార్కెట్ కార్యదర్శి గంగాధర్‌ను అడుగగా, నిర్ణయం తీసుకోవల్సింది ప్రభుత్వమని తెలిపారు.

ఆశలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

లోకేశ్వరం: ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశలకు ఉద్యోగ భద్రత కల్పించాలని మండల ఆశ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు ఆయిటి ఆనందకుమారి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలోని వైద్యురాలు తేజస్వినికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆనందకుమారి మాట్లాడుతూ ఆశలకు ఇన్సూరెన్సు కింద రూ.50 లక్షల చెల్లించాలని, ఏటా 20 రోజులు వేతనంతో కూడిన క్యాజువల్ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించే ధర్నాకు సెలవు ఇవ్వాలని కోరారు. ఆశ కార్యకర్తలు ఉన్నారు.

పాఠశాలలో బోరుబావి ఏర్పాటు



స్వర్ణ ఆశ్రమ పాఠశాలలో బోరుబావి వేయిస్తున్న ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ

సారంగాపూర్: కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా స్థానిక ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ.. స్వర్ణ గ్రామంలోని ఆశ్రమ పాఠశాల విద్యార్థుల తాగునీటి కష్టాలను తీర్చారు. తాగునీటి కోసం ఇబ్బందులపై పాఠశాల సిబ్బంది ఆయన దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించారు. పాఠశాలకు వెళ్లి పరిస్థితిని గమనించి సోమవారం సొంత ఖర్చులతో బోరుబావి వేయించారు. విద్యార్థులు, సిబ్బంది, గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పోతారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ పోతారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

డీఆర్డీవోను కలిసిన పక్షి ప్రేమికులు



వరికుచ్చులు అందిస్తున్న విజయలక్ష్మి

నిర్మల్‌ఖిల్లా: పక్షుల ఆహారం కోసం ఇటీవల వరికుచ్చులు తయారుచేసిన డీఆర్డీవో విజయలక్ష్మిని సామాజిక కార్యకర్తలు, పక్షి ప్రేమికులు జక్కుల వెంకటేశ్, సిలారి నవీన్ జిల్లా కేంద్రంలోని ఆమె కార్యాలయంలో సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె వారికి వరికుచ్చులు అందించగా.. వెంకటేశ్, నవీన్‌లు పక్షి గూడు, బర్డ్ ఫీడర్లను ఆమెకు అందజేశారు.

మాజీ సర్పంచుల అరెస్ట్

కడెం/పెంబి/లక్ష్మణచాంద: పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ సోమవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న పలువురు మాజీ సర్పంచులను కడెం, పెంబి, లక్ష్మణచాంద పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. వారిని పోలీసు స్టేషన్లకు తరలించారు. రవి, భూమేశ్, వెంకట్‌రెడ్డి మహేందర్, తానాజీ, రాజు ఉన్నారు.

వచ్చేస్తాడు.. పట్టేస్తాడు

- పాముందని సమాచారమిస్తే చాలు
- విషసర్పాలను చాకచక్యంగా పట్టి..
- అడవుల్లో వదులుతున్న స్నేక్ క్యాచర్



జనావాసాల్లో పట్టుకున్న విషసర్పంతో గిరిగంటి వినీల్ కుమార్ (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: పాము కనిపిస్తే చాలు..అల్లంత దూరాన పారిపోతాం.. ప్రాంతమంతా కలకలంతో అలజడి రేపుతుంది. ఒకవేళ పాము కరిస్తే.. ఇక బాధ వర్ణణాతీతం. కరిచినదాని విష ప్రభావంకంటే భయంతో గుండె కొట్టుకునే వేగం పెరిగి ప్రాణాపాయానికి దారితీస్తుంది. అలాంటి విష సర్పాలను సైతం అలవోకగా పట్టేస్తున్నాడు స్నేక్ క్యాచర్ గిరిగంటి వినీల్‌కుమార్. జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీకి చెందిన పాలకేంద్రం నిర్వహిస్తుంటాడు. పాము కనిపించిందని చూసిన వ్యక్తులు ఫోన్ చేయగానే నిమిషాల్లో అక్కడ ఉంటాడు. ఎంత చిన్న కలుగులో ఉన్నా సరే దాన్ని ఇట్టే పట్టేస్తాడు. సంచిలో వేసుకుని దూరంగా వదిలేసి వస్తాడు. ఒక్క రూపాయి ఆశించకుండా తన వంతు సేవ చేస్తానంటున్నాడు. జిల్లాకేంద్రం, సమీప ప్రాంతాల్లోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, జనావాసాల్లో ఇప్పటివరకు వందల పాములను పట్టుకుని అటవీప్రాంతంలో వదిలిపెట్టినట్లు చెబుతున్నాడు. తాజాగా జిల్లా కేంద్రం సమీపగ్రామమైన కొండాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో ఈనెల 6న కనిపించిన నాగుపామును చూసిన చిన్నారులు, తల్లిదండ్రులు, గర్భిణులు భయాందోళనలకు గురయ్యారు. టీచర్ విజయలక్ష్మి.. వినిల్‌కుమార్‌కు సమాచారమిచ్చారు. పాము పట్టుకుని అటవీప్రాంతంలో వదిలిపెటడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆత్మరక్షణ కోసమే పాములు కాటు వేస్తాయని, పాములు కనిపించినప్పుడు వెంటనే సంప్రదించాలని, భయాందోళనకు గురై కర్రలతో విసరడం, రాళ్లతో కొట్టడం చేయొద్దని వినీల్‌కుమార్ తెలిపాడు.

108లో ప్రసవాలు

తానూరు: మండలంలోని బోల్సా గ్రామానికి చెందిన గర్భిణి కావేరికి సోమవారం సాయంత్రం పురిటినొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. సిబ్బంది అక్కడికి చేరుకుని భైంసా ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యన పురిటినొప్పులు ఎక్కువ అయ్యాయి. అంబులెన్స్‌లో ప్రసవం చేయగా పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని ఈఎంటీ సాయిప్రసాద్ ,పైలట్ ఖాజామైనొద్దీన్ తెలిపారు.

భైంసారూరల్: కుభీర్ మండలం రంజినితండాకు చెందిన గర్భిణి దేవుబాయికి సోమవారం పురిటి నొప్పులతో బాధపడుతుంది. కుటుంబీకులు 108 అంబులెన్సుకు సమాచారం అందించారు. సిబ్బంది అక్కడికి చేరుకుని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో టాక్లి సమీపంలో ఈఎంటీ పుజారి లక్ష్మణ్, పైలెట్ గౌతంలు ప్రసవంచేశారు. జన్మించిన ఆడశిశువును, తల్లిని ఆసుపత్రిలో చేర్పించారు.

రోడ్డు భద్రతపై అవగాహన

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రత నిబంధనలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంవీఐ ఎ.మహేందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు నియమ నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహన ధ్రువపత్రాలతోపాటు లైసెన్స్‌లు తమవెంట తెచ్చుకోవాలన్నారు. పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణించొద్దన్నారు. హెచ్‌ఎం కిషన్‌రావు, కానిస్టేబుల్ చౌహాన్ కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డాటా ఎంట్రీని పూర్తిచేయాలి

కుంటాల: గడువులోగా డాటా ఎంట్రీని పూర్తి చేయాలని డీపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇటీవల ఇంటింటా నిర్వహించిన సర్వేను ఆన్‌లైన్‌లో వార్డుల వారీగా క్రమబద్ధీకరిస్తున్న ప్రక్రియను సోమవారం పర్యవేక్షించారు. వార్డుల వారీగా విభజన చేసి తప్పులు లేకుండా చూడాలన్నారు. ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో ఎంఎ రహీంఖాన్, కార్యదర్శులు ఉన్నారు.

దివ్యాంగులకు బస్‌పాసుల పంపిణీ

సారంగాపూర్: మండలంలోని బీరవెల్లి గ్రామంలో 22మంది దివ్యాంగులకు 50 శాతం రాయితీపై సోమవారం ఆర్టీసీ అధికారులు బస్‌పాసులు పంపిణీ చేశారు. ఆర్టీసీ డీఎం ప్రతిమారెడ్డి ఆదేశాల మేరకు వీటిని అందించినట్లు అధికారులు టీవీ రమణ, సాయరెడ్డి తెలిపారు. దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు కట్కం నర్సయ్య, గ్రామస్తులు మారుతీరెడ్డి, నవీన్, ప్రశాంత్, లక్ష్మణ్ ఉన్నారు.

కార్యదర్శులపై పనిభారం తగ్గించాలి



మామడ: ఎంపీడీవో సుశీల్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

కుంటాల: తమకు పని భారం తగ్గించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శులు కుంటాల ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో ఎంఎ రహీంఖాన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. జాబ్ చార్ట్ ప్రకారం నిర్వహించిన విధులు కాకుండా ఇతర శాఖ పనులు, సర్వేలు అప్పగించే క్రమంలో వాట్సప్ మెసేజ్‌లు, జూమ్ మీటింగ్ ద్వారా మాత్రమే ఆదేశాలు జారీ చేయాలని పేర్కొన్నారు. సెలవులు, పండుగ రోజుల్లో పని చేయించడంతో తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నామని తెలిపారు.

నర్సాపూర్(జి): ఇందిరమ్మ ఇళ్ల సర్వే నుంచి మినహాయింపు ఇవ్వాలని, పని భారం తగ్గించాలని, ప్రభుత్వాల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, విధి నిర్వహణలో మృతిచెందిన కార్యదర్శుల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని కార్యదర్శులు కోరారు. ఈ మేరకు ఎంపీడీవో పుష్పలతకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యదర్శులు నవనీత్ కుమార్, నరేశ్‌కుమార్, రాజు, శివకుమార్, సాయి కిరణ్, వెంకటేశ్, సంధ్యారెడ్డి, గంగాజల, సంస్కృతి ఉన్నారు.

కుభీర్: పనిభారం తగ్గించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఎంపీడీవో నవనీత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం మండల అధ్యక్షుడు విజయ్, నాయకులు కిరణ్, సంజు, కమల్‌సింగ్, సునీల్ ఉన్నారు.

మామడ: ఇతర శాఖల పనులు తమకు అప్పగించవద్దని మండల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో సుశీల్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందించారు.

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



నిర్మల్‌చైన్‌గేట్: వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



భైంసాటౌన్: కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్

నిర్మల్‌చైన్‌గేట్: సోనియాగాంధీ జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఆదేశాలతో జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో నాయకులు సోమవారం భారీ కేక్‌ను కట్ చేశారు. ఒకరికొకరు తినిపించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేసిన ఘనత సోనియాగాంధీకే దక్కిందన్నారు. మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీంరెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు రాజేశ్వర్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సమరసింహారెడ్డి, ఎన్‌ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు రాకేశ్, నాయకులు వేణుగోపాల్, ఆయన్నగారి పోశెట్టి, అజహర్, మతీన్ పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్‌చేశారు. మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, పార్టీ మండల అధ్యక్షుడు దయానంద్, పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేశ్, నాయకులు ఉన్నారు.

సారంగాపూర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ, నాయకులు పోతారెడ్డి, రాజ్‌కుమార్, పవార్ రాజేష్, తదితరులు ఉన్నారు.

కడెం: సోనియాగాంధీ జన్మదినం పురస్కరించుకుని మండల కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు పొద్దుటూరి సతీశ్ రెడ్డి సోమవారం నిరుపేదలు, పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌వర్మ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శంకర్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మల్లేశ్‌యాదవ్, భూషణం, ముస్కు రాజు, బబ్లు, రఫీక్, సలీమ్, బొడ్డు గంగన్న, సత్యం చారి, కోల శ్రీనివాస్, మహిళా మండల అధ్యక్షురాలు జలజ, రహీమ్, పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బి నారాయణ్‌రావు పటేల్ కేక్ కట్‌చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సోనియాగాంధీ వల్లే ప్రత్యేక తెలంగాణ సాధ్యమైందన్నారు. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్నారు.బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఓం ప్రకాశ్ లడ్డా, మాజీ ఎంపీపీ రామచందర్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో పార్టీ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేశ్వర్, నిర్మల్ ఏఎంసీ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, తాజా మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్, మండల కేంద్రం మాజీ సర్పంచ్ బిట్లింగ్ నారాయణ, నాయకులు ప్రతాప్‌రెడ్డి, సురేష్, రవి, అజార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ ఏర్పాట్లు పరిశీలించిన చైర్మన్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో ఈనెల 10 నుంచి 12 వరకు నిర్వహించే సీఎం కప్ క్రీడల పోటీల ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ సోమవారం పరిశీలించారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి): ఈనెల 10 నుంచి 12 వరకు నిర్వహించే మండల స్థాయి సీఎం కప్ పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని డీపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని క్రీడా మైదానాన్ని సోమవారం పరిశీలించారు. క్రీడాకారులకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఎంపీడీవో పుష్పలత, ఎంఈఓ కిషన్ రావు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి, పీడీ దేవేందర్ ఉన్నారు.

లక్ష్మణచాంద: మండల స్థాయి సీఎం కప్ క్రీడల నిర్వహణ కోసం పాఠశాలలోని క్రీడా మైదానాలను ఎంపీడీవో రాధ పరిశీలించారు. ఈనెల 12న మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించే మండల స్థాయి సీఎం కప్ క్రీడల నిర్వహణపై వ్యాయామ ఉపాధ్యాయులతో సోమవారం మాట్లాడారు. క్రీడాకారులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఎంపీవో అమీర్ ఖాన్, పంచాయతీ కార్యదర్శి విక్రమ్ రాజుకు సూచించారు. వ్యాయామ ఉపాధ్యాయులు రమణారావు, శ్రీనివాస్, వాసుదేవరెడ్డి ఉన్నారు.

కుంటాల: ఈనెల 10 నుంచి 12 వరకు నిర్వహించే సీఎం కప్ మండల స్థాయి పోటీలు పకడ్బందీగా నిర్వహించాలని డీపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. కుంటాల ఆదర్శ పాఠశాల ఆవరణలో ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో ఎంఎ రహీంఖాన్, పీడీ ముఖీం, పంచాయతీ కార్యదర్శి రాజబాపు, పీఈటీలు మమత, శ్రీలత తదితరులు ఉన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, బొమ్మెన సురేశ్ డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, రైతు భరోసా పథకం ద్వారా ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దోపిడిని అరికట్టాలన్నారు. సన్న రకంతోపాటు దొడ్డు రకం వరి ధాన్యానికి బోనస్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు నాగేల్లి నరసయ్య, తొడసం శంభు, నాయకులు రాపల్లి రాజేశ్‌యాదవ్, రైతులు వెంకట్రాజం, పెద్ది రాజన్న, రాపల్లి మల్లయ్య, విజయ, శంకర్, జాదవ్ మోతీరాం, జాదవ్ కిషన్, మెస్రం నాగరాజు పాల్గొన్నారు.

మండలస్థాయి బయో సైన్స్ టాలెంట్ టెస్టులు



లక్ష్మణచాంద: పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు



లోకేశ్వరం: పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి బయో సైన్స్ టాలెంట్ టెస్టులు నిర్వహించారు. వివిధ ప్రభుత్వ, కేజీబీవీ విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో గెలుపొందినవారికి హెచ్‌ఎం రాజునాయక్ బహుతులు అందజేశారు. ఆంగ్లమాధ్యమంలో వడ్యాల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని శృతిక(ప్రథమ), ద్వితీయ స్థానంలో లక్ష్మణచాంద ఉన్నత పాఠశాల విద్యార్థి రాంచరణ్ నిలిచాడు. తెలుగు మీడియంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో అనుష్క, రష్మిత (పీచర ఉన్నత పాఠశాల) నిలిచారు. తెలంగాణ బయో సైన్స్ ఫోరం తరపున పరిశీలకులుగా జీవశాస్త్రం ఉపాధ్యాయులు గంగా సురేశ్, వేముల సుదర్శన్, మండల ఇన్‌చార్జి రమేశ్ గౌడ్, ఉపాధ్యాయులు అశోక్, నారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కడెం: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ గుర్తించేందుకు టాలెంట్ టెస్టులు ఎంతో ఉపయోగమని ఎంఈవో షేక్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలంగాణ బయో సైన్స్ ఫోరం అధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్టుకు హాజరయ్యారు. ఇంగ్లిష్ మీడియం విభాగంలో లింగాపూర్ జెడ్పీ పాఠశాల విద్యార్థిని జీవనజ్యోతి (ప్రథమ), అమూల్య (ద్వితీయ), తెలుగు మీడియం విభాగంలో లింగాపూర్ పాఠశాల విద్యార్థి సతీశ్ (ప్రథమ), కడెం పాఠశాల విద్యార్థిని అమూల్య (ద్వితీయ) స్థానాల్లో నిలిచారు. హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, టీబీఎస్ఎఫ్ మండల కోఆర్డినేటర్ వాల్గొట్ కిషన్, మధుకర్, సత్యభామ, విజయ, వర్ణ తదితరులు ఉన్నారు.

ముథోల్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండల స్థాయి బయోసైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ టెస్టులో పదో తరగతి విద్యార్థిని జీ.కీర్తన ప్రతిభ చూపి ద్వితీయ స్థానం సాధించిందని ఇన్‌చార్జి హెచ్‌ఎం కవిత తెలిపారు.

లోకేశ్వరం: ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సోమవారం బయోసైన్స్‌పై టాలెంట్ టెస్టు నిర్వహించారు. రాజూర ఉన్నత పాఠశాల విద్యార్థులు (ఇంగ్లిష్ మీడియం) జయోనంద్ర, సాయితేజ, తెలుగు మీడియంలో మన్మద్ పాఠశాల విద్యార్థి రాజు, లోకేశ్వరం ఉన్నత పాఠశాల విద్యార్థిని అంబికలు ప్రతిభ కనబర్చారు. వీరు జిల్లా నిర్వహించే జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని లోకేశ్వరం హెచ్‌ఎం కిరణ్‌కుమార్ తెలిపారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్, నారాయణ్, శ్రీనివాస్ ఉన్నారు.

సంక్షిప్తంగా

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: వైద్య ఆరోగ్యశాఖ ఆర్ఎన్ టీసీపీ విభాగంలో సీనియర్ ట్రీట్‌మెంట్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న భరత్ సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం 3194 జిల్లా అధ్యక్షుడు కృష్ణ మోహన్‌గౌడ్ ఓ ప్రకటనలో కోరారు. భార్య పల్లవికి ఉద్యోగం కల్పించి రూ10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని పేర్కొన్నారు.

గో రక్ష మహా పాదయాత్ర

నిర్మల్‌టౌన్: బాలకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో గోరక్షణ కోసం కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టిన మహా పాదయాత్ర సోమవారం నిర్మల్‌కు చేరుకుంది. నిర్మల్ అయ్యప్ప సేవా సమితి సభ్యులు వారికి మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం పురవీధుల గుండా యాత్రను కొనసాగించారు. అయ్యప్ప సేవా సమితి అధ్యక్ష కార్యదర్శులు బద్రి శ్రీనివాస్, విఘ్నేష్ పాల్గొన్నారు

దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

కడెం: దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని ఎంఈవో షేక్ హుస్సేన్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆటల పోటీల్లో గెలుపొందిన పలువురు దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కడెం కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఐఈఆర్టీ సునీత, నాగరాజు, రాజేశ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

కలెక్టర్, ఆర్డీవోకు వినతి

సోన్: కడ్తాల్ గ్రామానికి ఆనుకొని నిర్మించిన ఎన్‌హెచ్ 44 సమీపంలో నిర్మించిన అండర్ పాస్ బ్రిడ్జిపై ప్రమాదాలు జరగడంపై కడ్తాల్ గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. జిల్లాకేంద్రంలో కలెక్టర్ అభిలాష అభినవ్, ఆర్డీవో రత్న కళ్యాణిని సోమవారం కలిసి ఈ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.

జిల్లాస్థాయిల్లో ద్వితీయ బహుమతి

కుభీర్ దొడర్నా ఆశ్రమ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి సైన్స్ విజ్ఞాన ప్రదర్శనలో వనరుల అభివృద్ధి అనే అంశంపై ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు శ్రీధర్, ఆర్.అర్జున్, మురళీ, బలిరాంను పలువురు అభినందించారు.

విద్యార్థులకు 'ఓపెన్ హౌస్'

నిర్మల్‌టౌన్: ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ఆల్ఫోర్స్ పాఠశాలలోని విద్యార్థులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఆయుధాలు, బాంబు డిస్పోజల్, సామాగ్రి వినియోగం గురించి వారికి వివరించారు. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రాంనిరంజన్, బాంబు స్క్వాడ్ టీం రమేశ్ రాథోడ్, రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

లక్ష్మణచాంద: జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్ పోటీల్లో పరిశుభ్రత అంశంపై పీచర ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి వికాస్ ప్రదర్శన చేశారు. ఈయనకు జిల్లా స్థాయిలో తృతీయ బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని హెచ్‌ఎం సాయికృష్ణ అభినందించారు.

కడెంలో..

కడెం: ఈనెల 7న, జిల్లా కేంద్రంలో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబర్చిన లింగాపూర్ జెడ్పీ పాఠశాల విద్యార్థులను హెచ్‌ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు అభినందించారు. గైడ్ టీచర్ నీలిమా, ఉపాధ్యాయులు ఉన్నారు.

సామన్యశాస్త్రంపై ప్రతిభ పోటీలు

తానూరు: సామన్యశాస్త్రం ఫోరం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సామన్య శాస్త్రంపై విద్యార్థులకు సోమవారం మండల స్థాయి ప్రతిభ పోటీలు నిర్వహించారు. ఆయా పాఠశాలల పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ప్రతిభకనబర్చిన జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో నరేందర్ తెలిపారు. ఈనెల 18న జిల్లా కేంద్రంలో నిర్వహించే పోటీల్లో వారు పాల్గొంటారని వివరించారు. హెచ్‌ఎం సాయిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఏర్పాటులో బీజేపీ పాత్ర కీలకం

నర్సాపూర్(జి): ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో బీజేపీ పాత్ర కీలకమని ఆపార్టీ రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్ పేర్కొన్నారు. మండలంలోని రాంపూర్‌లో సోమవారం నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం సోనియాగాంధీ వల్ల వచ్చిందని చెప్పడం సీఎం రేవంత్ రెడ్డి అవివేకమని తెలిపారు. మండల అధ్యక్షుడు అర్జున్ ఠాకూర్, ప్రధాన కార్యదర్శి గంగాధర్, బూత్ కమిటీ అధ్యక్షుడు జంగోల్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మొరం ట్రాక్టర్ల పట్టివేత

ఖానాపూర్: అక్రమంగా తరలిస్తున్న మొరం ట్రాక్టర్లను పట్టుకున్నామని తహసీల్దార్ శివరాజ్ తెలిపారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై నుంచి సోమవారం అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను గుర్తించామన్నారు. రెండు ట్రాక్టర్లకు జరిమానా విధించగా, మరో రెండు ట్రాక్టర్ల నంబర్లు తెలియకపోవడంతో సిబ్బంది కళ్లు గప్పి పరారయ్యారని తెలిపారు.

మహాసభలు విజయవంతం చేయాలి

మామడ: నిజామాబాద్‌లో ఈనెల 14, 15 తేదీల్లో నిర్వహించే బహుజన లెఫ్ట్ పార్టీ మహాసభలు విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ మహమూద్ కోరారు. మండల కేంద్రంలో బీడీ కార్మికులతో కలిసి సోమవారం మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె నోటీసు అందజేత

తానూరు: మండలంలోని ఆయా శాఖల్లో పనిచేస్తున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు ఎంఈవో నరేందర్‌కు సోమవారం సమ్మె నోటీస్ అందజేశారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ సమ్మెలో పాల్గొననున్నట్లు రాతపూర్వకంగా రాసి ఇచ్చారు. కేజీబీవీ, పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులు, ఎంఈవో కార్యాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

కబ్జాచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

లోకేశ్వరం: ఎస్సారెస్పీ ప్రాజెక్టు ముంపు గ్రామం బామ్నికేలో అక్రమంగా పంటలు పండిస్తూ భూములను కబ్జాచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. తహసీల్దార్ మోతీరామ్‌కు సోమవారం వినతిపత్రం అందించారు.

పుస్తె, మెట్టెలు అందజేత

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలోని ఎరుకలవాడకు చెందిన నిరుపేద యువతి వివాహానికి ఖానాపూర్ వాసి, ఓకేఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కృష్ణంరాజు సహకారంతో పుస్తెమెట్టెలు అందజేశారు. చిన్నపోషన్న కూతురు చిన్నమ్మికి సోమవారం ఫౌండేషన్ సభ్యులు పుస్తెమెట్టెలు అందించగా కాలనీవాసులు అభినందించారు.

30 పడకల ఆసుపత్రి కోసం రిలే దీక్ష

కుంటాల: కుంటాలలో 30 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరుతూ మిషన్ కుంటాల చైర్మన్ దొనికెన వెంకటేశ్ సోమవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. మాజీ సర్పంచ్ సమత, గ్రామస్తులు గొల్ల గంగారాం, బోగ లక్ష్మణ్, శ్రీరామ్‌వార్ గజేందర్, కుమ్మరి రమేశ్, పలువురు యువకులు ఈ దీక్షకు మద్దతు తెలిపారు.

శివాజీ మృతికి నివాళి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు వెలగపూడి శివాజీ ఇటీవల మృతి చెందాడు. స్థానిక లయన్స్ క్లబ్‌లో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చంద్రమోహన్ రెడ్డి, జోన్ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, సభ్యులు ఉన్నారు.

యోగాపై అవగాహన

మామడ: ధ్యానం చేయడం ద్వారా ఒత్తిడిని జయించగలమని శిక్షకుడు సాయిలు అన్నారు. పొన్కల్, కొరిటికల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలల విద్యార్థులకు సోమవారం ధ్యానం,యోగాపై అవగాహన కల్పించారు.